నమస్తే తెలంగాణ
నిజామాబాద్, మంగళవారం 7 జనవరి 2025
TUESDAY, JANUARY 7, 2025

రుద్రూర్‌లో తాగునీటి సమస్య

- జీపీ కార్యాలయంలో కాలనీవాసుల నిరసన

జీపీ కార్యాలయంలో నిరసన వ్యక్తంచేస్తున్న కాలనీవాసులు

రుద్రూర్, జనవరి 6 : మండలకేంద్రంలోని 6వ వార్డులో ఉన్న దుర్కి గల్లీ (శ్రీ వీరభద్రస్వామి) కాలనీలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్నదని, సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు సోమవారం నిరసనకు దిగారు. ఐదురోజులుగా తాగునీరు రాకపోవడంతో గ్రామ పంచాయతీ కార్యాలయానికి వెళ్లి ఆగ్రహం వ్యక్తం చేశారు.

దేశాయి బీడీ కంపెనీ ఎదుట ధర్నా

కంపెనీ ఎదుట ధర్నా చేస్తున్న బీడీ కార్మికులు

మోస్రా (చందూర్), జనవరి 6 : మోస్రా మండలకేంద్రంలోని దేశాయి బీడీ కంపెనీ ఎదుట కార్మికులు టీయూసీఐ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా చేశారు. టీయూసీఐ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశ్ మాట్లాడుతూ.. ఒప్పందం ప్రకారం బీడీ కార్మికులకు వేతనం పెంచాల్సి ఉన్నా.. పెంచకుండా శ్రమ దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు డి. రాజేశ్వర్, కార్మిక సంఘాల నాయకులు ఎండీ ఇర్షాద్, షేక్ మహబూబ్, మున్వార్, బీడీ కార్మికులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఒకరికి రెండు రోజుల జైలు శిక్ష

వినాయక్‌నగర్, జనవరి 6 : నిజామాబాద్ రూరల్ పోలీసులు ఆదివారం డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. వేల్పూర్ మండలానికి చెందిన సి.లక్ష్మణ్‌ను బ్రీత్ ఎనలైజన్‌తో పరీక్షించగా, మద్యం తాగి వాహనం నడుపుతున్నట్లు నిర్ధారణ అయ్యింది. దీంతో అతడిపై కేసు నమోదు చేసి, సోమవారం కోర్టులో హాజరుపర్చారు. సదరు నిందితుడికి రెండు రోజుల పాటు జైలుశిక్ష విధిస్తూ స్పెషల్‌కోర్టు మెజిస్ట్రేట్ తీర్పు వెల్లడించినట్లు ఎస్సై ఆరిఫ్ తెలిపారు. దీంతో సదరు వ్యక్తిని జిల్లా జైలుకు తరలించారు.

భార్యపై కత్తితో దాడి చేసిన భర్త

వినాయక్‌నగర్, జనవరి 6 : బాకీ డబ్బుల కోసం భార్యాభర్తల మధ్య జరిగిన గొడవ కత్తిపోట్లకు దారితీసింది. నిజామాబాద్ రూరల్ ఎస్సై మహ్మద్ ఆరిఫ్ కథనం ప్రకారం.. మోపాల్ మండలం తాడెం (ఠానా కుర్దు) గ్రామానికి చెందిన గణేశ్‌కు మల్లారం గ్రామానికి చెందిన మౌనికతో ఏడాది క్రితం వివాహం జరిగింది. గణేశ్ అత్త (భార్య తల్లి)కి రూ.50 వేలు అప్పుగా ఇప్పించాడు. ఇందులో నుంచి ఆమె రూ.30 వేలు మాత్రమే చెల్లించింది. మిగతా రూ.20 వేల విషయంలో ఆదివారం రాత్రి గణేశ్ తన భార్య, అత్తలను నిలదీశాడు. దీంతో వారి ముగ్గురి మధ్య గొడవ జరగడంతో ఆగ్రహానికి గురైన గణేశ్ ఇంట్లోని కూరగాయలు కోసే కత్తితో మౌనికపై దాడి చేశాడు. ఆమెను కుటుంబీకులు చికిత్స కోసం దవాఖానకు తరలించారు. మౌనిక ఫిర్యాదు మేరకు గణేశ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

'ప్రజావాణి'కి 122 ఫిర్యాదులు

ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, అధికారులు

కంఠేశ్వర్, జనవరి 6 : కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 122 ఫిర్యాదులు వచ్చాయని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు తెలిపారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలు కలెక్టర్‌తోపాటు అదనపు కలెక్టర్ అంకిత్, డీఆర్డీవో సాయాగౌడ్, నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్‌కుమార్, మెప్మా పీడీ రాజేందర్, ఇన్‌చార్జి డీపీవో శ్రీనివాస్, బోధన్ ఏసీపీ శ్రీనివాస్‌కు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ సూచించారు.

బంధువుల నుంచి ప్రాణహానీ ఉందని మహిళ ఫిర్యాదు..

కంఠేశ్వర్, జనవరి 6 : తనకు బంధువుల నుంచి ప్రాణహాని ఉన్నదని, కాపాడాలని కోరుతూ వర్ని మండలం జలాల్‌పూర్ గ్రామానికి చెందిన ప్రియాంక ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ప్రియాంక భర్త చనిపోవడంతో భర్త పేరిట ఉన్న ఎకరం వ్యవసాయ భూమి నిబంధనల ప్రకారం తన పేరిట చేసుకోకుండా బిచ్కుందకు చెందిన తన ఆడపడుచు సుజాత, ఇతర బంధువులు కటికె హుస్సేని, కటిక సాయబు, కటిక అంజుతో కలిసి దాడి చేస్తూ, బెదిరిస్తున్నారని ఫిర్యాదు చేసింది. ఆ భూమిలో పంట సాగు చేసుకోకుండా ఇబ్బందులు పెడుతున్నారని, వారితో ప్రాణహాని ఉన్నదని, వారిపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

బియ్యం అదనపు నిల్వలపై పాఠశాలలో విచారణ

ధర్పల్లి, జనవరి 6 : మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బియ్యం అదనపు నిల్వలపై తహసీల్దార్ మాలతి సోమవారం విచారణ చేపట్టారు. పాఠశాల గదుల్లో బియ్యం దాచిపెట్టడంతోపాటు పలు సమస్యలపై హెచ్ఎం ఘణ జ్యోతిరాణి వ్యవహరిస్తున్న తీరుపై ఉపాధ్యాయులు కలెక్టర్‌తోపాటు డీఈవోకు ఇటీవల ఫిర్యాదు చేశారు. దీంతో తహసీల్దార్ పాఠశాలకు రాగా.. హెచ్ఎం లీవ్‌లో ఉన్నట్లు ఉపాధ్యాయులు తెలిపారు. ఆమె ఉపాధ్యాయుల నుంచి వివరాలను సేకరించారు.

ఆదర్శ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

రుద్రూర్, జనవరి 6 : మండలంలోని అంబం శివారులో ఉన్న ఆదర్శపాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ సతీశ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 28వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని, అభ్యర్థులకు ఏప్రిల్ 13న పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

స్థలాన్ని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

కోటగిరి (పొతంగల్) , జనవరి 6 : ఇరిగేషన్ స్థలాన్ని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కోటగిరి తహసీల్ కార్యాలయం ఎదుట సీపీఐ నాయకులు సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. సీపీఐ బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి దుబాస్ రాములు మాట్లాడుతూ.. నిజాంసాగర్ కెనాల్ 28/1/2 సరిహద్దు స్థలాన్ని కబ్జా చేసి గోడ నిర్మించారని, ఇరిగేషన్ అధికారులకు సమాచారం ఇచ్చి వారం రోజులు గడిచినా స్పందన లేదని అన్నారు. కబ్జాకు గురైన స్థలాన్ని తహసీల్దార్ గంగాధర్ సిబ్బందితో కలిసి పరిశీలించి, వివరాలను సేకరించారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో యువకుడి హంగామా

వినాయక్‌నగర్, జనవరి 6 : నిజామాబాద్ ఆర్టీసీ బస్టాండ్‌లో ఓ యువకుడు అర్ధనగ్నంగా బస్సుల పైకి, పరుగులు తీస్తూ హంగామా సృష్టించిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. జిల్లాలోని ఓ తండాకు చెందిన యువకుడు తన తల్లితో కలిసి శనివారం సాయంత్రం బస్టాండ్‌కు వచ్చాడు. తన షర్టు తీసేసి, అర్ధనగ్నంగా బస్టాండ్‌లో ఉరుకులు, పరుగులు పెట్టాడు. బస్సుపైకి ఎక్కి దూకుతానని బెదిరించాడు. అక్కడే ఉన్న పోలీసులు, ఆర్టీసీ సిబ్బంది, ప్రయాణికులు సదరు యువకుడిని పట్టుకొని అతడి తల్లికి అప్పగించారు. ఈ విషయంలో తమకు ఫిర్యాదు అందలేదని వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు.

రూ.58.15 లక్షల విలువైన మత్తుపదార్థాల ధ్వంసం

వినాయక్‌నగర్/ జక్రాన్‌పల్లి/ భీమ్‌గల్, జనవరి 6 : నిజామాబాద్ డివిజన్ పరిధిలోని ప్రొహిబిషన్, ఎక్సైజ్ టీముల ఆధ్వర్యంలో నిర్వహించిన దాడుల్లో పట్టుబడిన, సీజ్ చేసిన మత్తుపదార్థాలను సోమవారం ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. మొత్తం 40 కేసుల్లో సీజ్ చేసిన ఎండు గంజాయి, అల్ప్రాజోలం తదితర మత్తుపదార్థాలను సూపరింటెండెంట్ మల్లారెడ్డి ఆధ్వర్యంలో జక్రాన్‌పల్లి మండలం పడ్కల్ గ్రామంలోని మెడికేర్ సర్వీసెస్‌లో దహనం చేశారు. రూ.58.15 లక్షల విలువ చేసే 548.15 కేజీల ఎండు గంజాయి, 3.353 కేజీల అల్ప్రాజోలాన్ని దహనం చేశారు. కామారెడ్డి జిల్లాకు సంబంధించి రూ.7.98 కోట్ల విలువైన మత్తు పదార్థాలను దహనం చేసినట్లు కామారెడ్డి జిల్లా ఎక్సైజ్ అధికారి హన్మంత్‌రావు తెలిపారు.

ముగిసిన షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు

కంఠేశ్వర్, జనవరి 6 : నగరంలోని వినాయక్‌నగర్‌లో కెప్టెన్ బ్యాడ్మింటన్ హబ్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన ఉమ్మడి నిజామాబాద్ మెన్స్ డబుల్స్ షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు సోమవారం ముగిశాయి. ఈ టోర్నమెంట్‌లో ఉమ్మడి జిల్లా నుంచి 73 జట్లు పాల్గొన్నాయి. ఓపెన్ మెన్స్ డబుల్ విభాగంలో కమ్మర్‌పల్లికి చెందిన మోహన్‌రెడ్డి, కిషన్ విన్నర్‌గా కమ్మర్‌పల్లికి చెందిన శివకృష్ణ రన్నర్స్‌గా నిలిచారు. 35+ మెన్స్ డబుల్స్ విభాగంలో కమ్మర్‌పల్లికి చెందిన మోహన్‌రెడ్డి, కిషన్ విన్నర్స్‌గా.. నిజామాబాద్‌కు చెందిన బాబు, శ్రీహరి రన్నర్స్‌గా నిలిచారని హబ్ నిర్వాహకులు కిరణ్, సంతోష్ తెలిపారు. విజేతలకు ట్రోఫీలతో పాటు నగదు బహుమతులను అందజేశారు.

బీసీ డిక్లరేషన్ హామీలను అమలుచేయాలి

- రాష్ట్ర ఓబీసీ మోర్చా అధికార ప్రతినిధి మక్కయ్య

పొతంగల్, జనవరి 6 : కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే బీసీ డిక్లరేషన్ హామీలను అమలుచేయాలని రాష్ట్ర ఓబీసీ మోర్చా అధికార ప్రతినిధి మక్కయ్య డిమాండ్ చేశారు. పొతంగల్ మండలకేంద్రంలో ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ కామారెడ్డిలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌ను అమలు చేసి, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని అన్నారు. బీసీలకు ప్రతి ఏడాది రూ.20 వేల కోట్ల బడ్జెట్ కేటాయిస్తామని ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. గతేడాదిని కలుపుకొని మొత్తం రూ. 40 వేల కోట్లు ప్రకటించాలని, లేకపోతే ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో ఉద్యమం చేస్తామని హెచ్చరించారు.

9న క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్

ఖలీల్‌వాడి, జనవరి 6 : జిల్లాకేంద్రంలోని ఎస్ఎస్ఆర్ కళాశాలలో ఈనెల 9న క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు కళాశాల అధినేత డాక్టర్ మారయ్యగౌడ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జస్ట్ డయల్, టాస్క్ ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూ ఉంటుందని, జిల్లాలోని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

దివ్యాంగ ఉద్యోగుల క్యాలెండర్ ఆవిష్కరణ

కంఠేశ్వర్, జనవరి 6 : కలెక్టర్ కార్యాలయంలో జిల్లా దివ్యాంగ ఉద్యోగుల క్యాలెండర్‌తోపాటు వారి హక్కుల గోడప్రతులను కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు శంకర్‌రాజు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, గౌరవ అధ్యక్షుడు రాజన్న, దివ్యాంగ నాయకులు కృష్ణారెడ్డి, బస్వయ్య, సాయిప్రసన్న, గంగాధర్, పండరి, దత్తు, విద్యాసాగర్, వెంకటేశ్, ప్రమోద్‌కుమార్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న హమాలీల నిరవధిక సమ్మె

సమ్మెలో పాల్గొన్న హమాలీలు

డిచ్‌పల్లి, జనవరి 6 : సివిల్ సప్లయీస్ హమాలీలు మండల కేంద్రంలో చేపట్టిన సమ్మె సోమవారం ఆరో రోజుకు చేరుకున్నది. మండలకేంద్రంలోని గోడౌన్ ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. ఏఐటీయూసీ నాయకుడు ఓమయ్య మాట్లాడుతూ.. హమాలీల కూలిని క్వింటాలుకు రూ.26 నుంచి రూ. 29కి పెంచిన రేట్లను అమలుచేయాలని, ఏరియర్స్‌తో కలిపి డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. మోహన్, గౌస్, దిలీప్, జాకీర్, బాలాజీ, నాగనాథ్, మనోహర్, లక్ష్మణ్, సంజు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

పొతంగల్, జనవరి 6 : మండలంలోని సుంకిని నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా సోమవారం ఉదయం ఇసుకను తరలిస్తుండగా రెండు ట్రాక్టర్లను పట్టుకున్నామని తహసీల్దార్ మల్లయ్య తెలిపారు. తదుపరి చర్యల నిమిత్తం రవాణా శాఖ అధికారులకు ట్రాక్టర్లను అప్పగించామని తెలిపారు.

జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ ప్రిన్సిపాల్ బుద్ధిరాజ్ సమాజసేవ జాతీయ అవార్డును హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం అందుకున్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జాతీయ అవార్డుల ప్రదానోత్సవంలో భాగంగా బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్ల రాధాకృష్ణ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు.
– ఖలీల్‌వాడి, జనవరి 6

'మహిళా శక్తి' కింద లబ్ధిదారులను గుర్తించాలి

సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్డీవో

కంఠేశ్వర్, జనవరి 6 : ఇందిరా మహిళా శక్తి పథకం కింద క్యాంటీన్లు, మొబైల్ ఫిష్ కౌంటర్లు, దేశీకోళ్ల మదర్ యూనిట్, ఇతర ఆదాయాభివృద్ధి కార్యక్రమాలకు లబ్ధిదారులను గుర్తించి, జాబితాను అందజేయాలని డీఆర్డీవో సాయాగౌడ్ సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం జిల్లా సమాఖ్య కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సెర్ప్ ఆధ్వర్యంలో ఎడపల్లి మండలం జాన్కంపేట్‌లో 2 మెగావాట్ల సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని, మండల, గ్రామ సమాఖ్యలు సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు కోసం ఎవరైనా ముందుకు వస్తే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామని చెప్పారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

12 బెటాలియన్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ అవేర్‌నెస్

అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ అధికారులు, సిబ్బంది

కంఠేశ్వర్, జనవరి 6 : 12వ తెలంగాణ బెటాలియన్ ఆధ్వర్యంలో సీటీసీ జాన్కంపేట్‌లో ఎన్‌సీసీ వార్షిక శిక్షణ శిబిరంలో భాగంగా కెడెట్స్‌కు సోమవారం ట్రాఫిక్ అవేర్‌నెస్ పోగ్రాం నిర్వహించారు. ట్రాఫిక్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ ప్రసాద్, ట్రాఫిక్ కానిస్టేబుల్ చందులాల్, శివప్రసాద్ ట్రాఫిక్ నిబంధనలు, నియంత్రించే విధానం, పాటించకపోవడం ద్వారా కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు.

వ్యక్తిపై దాడిచేసిన ముగ్గురిపై కేసు నమోదు

రుద్రూర్, జనవరి 6 : మండలంలోని సులేమాన్‌నగర్‌లో సోమవారం ఓ వ్యక్తిపై దాడి చేసిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాయన్న తెలిపారు. గ్రామంలో మురికికాలువకు సంబంధించి కొంతమంది గొడవకు దిగగా.. హబీబ్ అనే వ్యక్తి గొడవను అడ్డుకునే ప్రయత్నం చేశాడు. మధ్యలో ఎందుకు వచ్చావంటూ ముగ్గురు వ్యక్తులు దాడి చేశారు. చాకుతో పొడిచి చంపడానికి ప్రయత్నించారన్న హబీబ్ ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాయన్న తెలిపారు.

సంక్షిప్తంగా..

- **రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు -** సారంగాపూర్, జనవరి 6 : జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా రూరల్ మండలంలోని గుండారం జడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు ఎంవీఐ కిరణ్‌కుమార్ సోమవారం అవగాహన కల్పించారు. విద్యార్థులు భవిష్యత్తులో ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలను వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం అమర్‌నాథ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.
- **టీయూలో ఏబీవీపీ కేల్ ఉత్సవ్ వారోత్సవాలు ప్రారంభం -** డిచ్‌పల్లి, జనవరి 6 : ఏబీవీపీ – టీయూ శాఖ ఆధ్వర్యంలో టీయూలో కేల్ ఉత్సవ్ వారోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. టీయూ రిజిస్ట్రార్ యాదగిరి ముఖ్యఅతిథిగా హాజరై కబడ్డీ పోటీలను ప్రారంభించారు. స్వామి వివేకానంద జయంతి, జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా ఖేల్ ఉత్సవ్ కార్యక్రమాలను ప్రారంభించామని, ఈనెల 10వ తేదీ వరకు పోటీలు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఏబీవీపీ జాతీయ కార్యవర్గసభ్యుడు శివ, రాష్ట్ర కార్య సమితి సభ్యురాలు అమృత, యూనివర్సిటీ అధ్యక్షుడు సాయికుమార్, స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ మోహన్, ఉపాధ్యక్షుడు పావని, నాయకులు సమీర్, అశోక్, లెనిన్ , మహర్షి, నాగరాజు, నవీన్ పాల్గొన్నారు.

ఆర్మూర్ మండలంలోని చేపూర్ ఊర చెరువులో సోమవారం ఉదయం మత్స్యకారులకు 25 కిలోల చేప లభించింది. చేపలు పడుతుండగా ఈ చేప వలకు చిక్కిందని మత్స్యకారుడు దేవీదాస్ తెలిపాడు.
– ఆర్మూర్‌టౌన్, జనవరి6

రైతు భరోసా రూ.15వేలు అందించాలి

కమ్మర్‌పల్లిలో నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

బాల్కొండలో ..

మోర్తాడ్/వేల్పూర్/ముప్కాల్/బాల్కొండ/నవీపేట, జనవరి 6: రైతు భరోసా డబ్బులు ఏడాదికి రూ.15వేలు ఇస్తామని ఎన్నికల సమయంలో చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదికి రూ.12వేలే అని చెప్పి రాష్ట్ర రైతాంగానికి ధోకా చేసిందని బీఆర్ఎస్ కమ్మర్‌పల్లి మండల అధ్యక్షుడు రేగుంట దేవేందర్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీరుకుపై కమ్మర్‌పల్లిలోని భీమ్‌గల్ చౌరస్తా వద్ద జాతీయ రహదారిపై సోమవారం నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. గత కేసీఆర్ ప్రభుత్వం రైతుబంధు క్రమం తప్పకుండా ఇస్తున్న సమయంలో మూడుపంటకు ఇవ్వాలని మాట్లాడిన వారు ఇప్పుడు ఎందుకు ఇవ్వలేకపోతున్నారని ప్రశ్నించారు. వారు గతంలో చెప్పినట్లుగానే ఎకరానికి రూ.15వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులకూ రైతు భరోసా ఇవ్వాలని కోరారు. పార్టీ నాయకులు చిన్నారెడ్డి బద్దంరాజేశ్వర్, గడ్డం స్వామి, కాలేరు శేఖర్, రెంజర్ల మహేందర్, సంతరాజేశ్వర్, సుంకరిమురళీ, శ్రీనివాస్, మల్కాయి రాజన్న, నరేందర్ తదితరులు పాల్గొన్నారు. వేల్పూర్ మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయం వద్ద బీఆర్ఎస్ నాయకులు ధర్నా నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం రెవెన్యూ అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ముప్కాల్‌లో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ముస్కు భూమేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు సామ వెంకట్ రెడ్డి, ఉమా శంకర్, బద్దం నర్సారెడ్డి, కట్ట మహేశ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. నవీపేట మండల కేంద్రంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వి.నర్సింగ్‌రావు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు తెలంగాణ తల్లి విగ్రహానికి పూల మాల వేసి ధర్నా చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం తహసీల్ కార్యాయానికి ర్యాలీగా వెళ్లి ధర్నా చేశారు. రైతు భరోసా రూ.15వేలు ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు తెడ్డు పోశెట్టి, నవీపేట సొసైటీ చైర్మన్, వైస్ చైర్మన్లు న్యాలకంటి అబ్బన్న, దొంత ప్రవీణ్‌కుమార్, పార్టీ నాయకులు సూరిబాబు, బెల్లాల్ నర్సింగ్‌రావు, గైని సతీశ్, జనార్దన్, సాయికుమార్‌గౌడ్, ఈర్నాల స్వామి, ఆర్మూర్ శ్రీనివాస్, తోట పోతన్న, అజ్జు, తహేర్, హరినాంసింగ్ పాల్గొన్నారు.

మా టీచర్లు మాకు కావాలి

కేజీబీవీ విద్యార్థినుల ఆందోళన

విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎంఈవో

బోధన్ రూరల్, జనవరి 6: మా టీచర్లు మాకు కావాలంటూ విద్యార్థినులు బోధన్ మండలంలోని అమ్దాపూర్ గ్రామ శివారులో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో సోమవారం ఆందోళన చేపట్టారు. కేజీబీవీలో విధులు నిర్వహిస్తున్న సీఆర్టీలు సమ్మెలో ఉండడంతో విద్యార్థినులు ఆందోళన చెందుతున్నారు. పరీక్షల సమయం దగ్గర పడుతుండడంతో విద్యాశాఖ అధికారులు ఆరుగురు ప్రభుత్వ ఉపాధ్యాయులను కేజీబీవీలో సర్దుబాటు చేశారు. నాలుగు రోజులుగా వారు విద్యాబోధన సాగిస్తున్నారు. అయితే సీఆర్టీలతోనే తమకు విద్యాబోధన చేయాలని కోరుతూ విద్యార్థినులు ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న బోధన్ ఎంఈవో నాగయ్య పాఠశాలకు చేరుకొని విద్యార్థినులను సముదాయించారు. తాను అందుబాటులో ఉంటానని, ఏమైనా సమస్యలుంటే తనకు చెప్పాలని అన్నారు. దీంతో విద్యార్థినులు ఆందోళన విరమించారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

నవీపేట, జనవరి 6: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి కల్యాణలక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఎమ్మెల్యే మట్లాడుతూ సంక్రాంతి పండుగ తర్వాత రేషన్‌కార్డులు అందజేస్తామని, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్ల పథకాలను ప్రారంభిస్తామని అన్నారు. అనంతరం బాలుర పాఠశాలలో మధ్యాహ్న భోజనం, అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమంలో చేపడుతున్న అభివృద్ధి పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ రాజిరెడ్డి, ఆర్డీవో రాజేందర్‌కుమార్, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీపీ రాజేందర్‌కుమార్‌గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, మిర్యాల కిషన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సౌండ్ సిస్టమ్ వితరణ

మోర్తాడ్, జనవరి 6: కమ్మర్‌పల్లి మండలం చౌట్‌పల్లి ఉన్నత పాఠశాలకు దాతలు రూ. 35వేల విలువ చేసే సౌండ్ సిస్టమ్‌ను అందజేశారు. సోమవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో హెచ్ఎం, ఎంఈవో ఆంధ్రయ్యకు దాతలు ఆంప్లిఫయర్, సౌండ్‌బాక్స్‌లు, కేబుల్‌ను అందజేశారు.దాతలు నాగరాజు, రాకేశ్, తిరుమలేశ్, నరేశ్, పోషన్న, రాజేశ్వర్, గజానంద్‌ను హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

ఆర్మూర్‌టౌన్, జనవరి6: పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్‌లను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాలని బీసీ విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ద్యాగ శేఖర్ డిమాండ్ చేశారు. ఈనెల 8న హైదరాబాద్‌లో నిర్వహించనున్న బీసీ విద్యార్థుల సమర శంఖారావం పోస్టర్లను పట్టణంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో సోమవారం ఆవిష్కరించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

మాక్లూర్, జనవరి6: దాస్‌నగర్‌కు చెందిన సంపంగి సాయిలు(42) రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. దాస్‌నగర్‌కు చెందిన సంపంగి సాయిలు, అదే గ్రామానికి చెందిన మక్కల ప్రవీణ్ కలిసి కూలీ పని నిమిత్తం ఆదివారం బైక్‌పై నందిపేట్‌కు వెళ్లారు. రాత్రి 9 గంటలకు తిరిగి వస్తుండగా దాస్‌నగర్ నుంచి మాదాపూర్‌కు వెళ్తున్న బేగరి విజయ్‌కుమార్ బైకు గాంధీనగర్ వద్ద ఎదురెదురుగా ఢీకొన్నాయి. క్షతగాత్రులను స్థానికులు 108 అంబులెన్స్‌లో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ సంపంగి సాయిలు మృతిచెందాడు. మృతుడి భార్య సంపంగి లత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. మిగతా ఇద్దరు దవాఖానలో చికిత్స పొందుతున్నారు.

బీఆర్ఎస్ బీమా చెక్కు అందజేత

చెక్కును అందజేస్తున్న ఆయేషా ఫాతిమా

బోధన్, జనవరి 6: మండలంలోని బెల్లాల్ గ్రామానికి చెందిన కట్ట పద్మకు బీఆర్ఎస్ సభ్యత్వానికి సంబంధించిన ప్రమాద బీమా చెక్కు (రూ.2 లక్షలు)ను సోమవారం బోధన్ మాజీ ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ సతీమణి, బీఆర్ఎస్ నాయకురాలు ఆయేషా ఫాతిమా అందించారు. పట్టణంలోని తన స్వగృహంలో బీఆర్ఎస్ బోధన్ మండలం నాయకుల సమక్షంలో చెక్కు అందించారు. బెల్లాల్ గ్రామానికి చెందిన కట్ట గంగాధర్ రెండేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కార్యక్రమంలో బీఆర్ఎస్ బోధన్ మండలం అధ్యక్షుడు ధర్మన్న గారి సంజీవ్‌కుమార్, పార్టీ బోధన్ పట్టణ అధ్యక్షుడు రవీందర్ యాదవ్, బీఆర్ఎస్ నాయకులు భవానీపేట్ శ్రీనివాస్, గణేశ్ పటేల్, బర్దిపూర్ మాజీ సర్పంచ్ సాయరెడ్డి, పార్టీ బెల్లాల్ నాయకులు బర్రి లక్ష్మణ్, రాజు, శ్రీనివాస్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

'ఎవరినీ బహిష్కరించలేదు'

వేల్పూర్ జనవరి6: తాము ఎవరినీ బహిష్కరించలేదని పోచంపల్లి గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. తమ గ్రామంలో ఎనిమిది కుటుంబాలను తాము బహిష్కరించామని వస్తున్న వార్తల్లో వాస్తవం లేదని అన్నారు. సమావేశంలో గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు ముత్యం, గంగారెడ్డి, రమేశ్, చిన్నయ్య, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మమ్మ చెంతకు చిన్నారులు

పిల్లలను వారి అమ్మమ్మకు అప్పగిస్తున్న పోలీసులు

మాక్లూర్, జనవరి6: మండలంలోని దాస్‌నగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఆదివారం రాత్రి అనుమానాస్పదంగా ఇద్దరు బాలురు తిరుగుతున్నారని స్థానికులు మాక్లూర్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వచ్చి వారిని ఠాణాకు తీసుకెళ్లి వివరాలు సేకరించగా మనోజ్, మాదవ్‌గా చెప్పారని ఎస్సై రాజశేఖర్ తెలిపారు. సోషల్, ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా పిల్లల ఫొటోలు వైరల్ చేయడంతో పిల్లల అమ్మమ్మ, తాత ఆర్మూర్‌లోని మామిడిపల్లి నుంచి మాక్లూర్‌కు వచ్చారని అన్నారు. పిల్లల తండ్రి గతంలో చనిపోగా, అమ్మ జైల్లో ఉందని అన్నారు. అమ్మమ్మ, తాతల వద్ద ఉన్న ఇద్దరు పిల్లలు తప్పిపోయి మాక్లూర్‌లో దొరికారని అన్నారు. స్థానికుల సహకారంతో వారిని రాత్రి ఠాణాలోనే ఉంచుకొని సోమవారం అప్పగించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

కొనసాగుతున్న నీటివిడుదల

మెండోరా, జనవరి 5: శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి యాసంగి పంటలకు వివిధ కాలువల ద్వారా నీటివిడుదల కొనసాగుతున్నది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగుల(80.5టీఎంసీలు) కాగా ప్రస్తుతం 1088 అడుగుల(70.14టీఎంసీలు) నీరు నిల్వ ఉంది.

సంక్షిప్తంగా..

- **భూమిపూజ..-** మోర్తాడ్, జనవరి 6: కమ్మర్‌పల్లి మండలంలోని నాగాపూర్ గ్రామంలో కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ నిర్మాణానికి మార్కెట్‌కమిటీ చైర్మన్ పాలెపునర్సయ్య సోమవారం భూమిపూజ చేశారు. ప్రజల సౌకర్యార్థం దీనిని నిర్మిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజశ్రీనివాస్, ఏపీవో విద్యానంద్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుంకెట రవి, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.
- **కౌమారదశపై అవగాహన–** మోర్తాడ్, జనవరి 6: వర్ద్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో కమ్మర్‌పల్లి మండలం హాసాకొత్తూర్ ఉన్నత పాఠశాలలో కౌమారదశపై సోమవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. జీకే, అబ్జెక్టివ్ పరీక్షలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. పాఠశాలలో 15 రోజుల్లో మూడు విడుతలుగా వేర్వేరుగా కౌమారదశ–మార్పులు, ఎయిడ్స్‌పై అవగాహన, రక్తహీనత వ్యక్తిగత మార్పులు తదితర అంశాలపై అవగాహన కల్పించారు.
- **కల్లడిలో సొసైటీ ఏర్పాటు చేయాలి -** మాక్లూర్, జనవరి6: మండలంలోని కల్లడి గ్రామంలో సొసైటీనీ ఏర్పాటు చేయాలని కోరుతూ రైతులు జిల్లా కేంద్రంలో డీసీవోకు సోమవారం వినతి పత్రం అందజేశారు. గతంలో కల్లడిలో సొసైటీ ఉండేదన్నారు. గుత్ప, కల్లడి, డీకంపల్లి, రామచంద్రాపల్లి, గుత్ప తండా, చిన్నాపూర్ గ్రామాలు సొసైటీలో ఉండేవన్నారు. కొన్ని కారణాలతో కల్లడి సొసైటీని మాక్లూర్ సొసైటీలో విలీనం చేశారని అన్నారు. రైతులు చిన్నరాం, మధుకర్, దినేశ్, భూమయ్య, మోహన్, ప్రశాంత్ పాల్గొన్నారు.
- **ఎన్నికల హామీలను అమలు చేయాలి-** ఆర్మూర్‌టౌన్, జనవరి6: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ సర్కారు అమలు చేయాలని సీఐటీయూ నాయకులు అన్నారు. అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆసంఘం ఆవిర్భావ వేడుకలను సోమవారం నిర్వహించారు. సీఐటీయూ జెండాను ఎగురవేశారు.
- **సంతలో చోరీ-** భీమ్‌గల్, జనవరి 6: కూరగాయలు కొనడానికి వచ్చిన మహిళల వద్ద దొంగలు బంగారం, నగదు చోరీ చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. సోమవారం మండల కేంద్రంలో వారసంతతో కూరగాయలు కొనడానికి వచ్చిన కుప్కల్‌కు చెందిన గంధం సుప్రియ వద్ద పర్సును దొంగలు చోరీ చేశారని ఎస్సై మహేశ్ తెలిపారు. అందులో అర తులం బంగారం, కొంత నగదు ఉందని, బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.
- **ఇందిరమ్మ సర్వే పరిశీలన -** ఆర్మూర్‌టౌన్, జనవరి6: పట్టణంలోని 23వ వార్డులో ఇందిరమ్మ ఇండ్ల సర్వేను సోమవారం మున్సిపల్ కమిషనర్ పరిశీలించారు. సర్వే పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

బేకరి తనిఖీ

పట్టణంలోని 6వ వార్డులో ఉన్న ఓ బేకరీని సోమవారం మున్సిపల్ కమిషనర్ రాజు, సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. బేకరీలో పరిశుభ్రత పాటించాలని ర్వాహకులకు సూచించారు. నిబంధనలు పాటించని బేకరీలకు జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు.

అంగన్‌వాడీ కేంద్రం..

పట్టణంలోని 23వ వార్డులో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని మున్సిపల్ కమిషనర్ రాజు తనిఖీ చేశారు. అంగన్‌వాడీ టీచర్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలన్నారు. టీచర్లు సమయపాలన పాటించని అంగన్‌వాడీ టీచర్లపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చెరువులో నీటి పరిశీలన..

పట్టణంలోని కొటార్మూర్ చెరువును మున్సిపల్ కమిషనర్ రాజు పరిశీలించారు. డ్రైనేజీ నీరు కలిసి చెరువులోని నీరు కలుషితం అవుతున్నదని కొటార్మూర్ వీడీసీ సభ్యులు ఇటీవల ఫిర్యాదు చేయడంతో చెరువును సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు.

- **మధ్యాహ్న భోజనం..-** భీమ్‌గల్/రెంజల్, జనవరి 5: భీమ్‌గల్ మండలం బడాభీమ్‌గల్ జడ్పీహెచ్ఎస్‌లో మధ్యాహ్న భోజనాన్ని ఎంపీడీవో సంతోష్‌కుమార్ సోమవారం పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. రెంజల్ కేజీబీవీ, సాటాపూర్ ఉర్దూ మీడియం పాఠశాలను ఎంఈవో ఆంజనేయులు తనిఖీ చేశారు.
- **ట్రాఫిక్ రూల్స్ పాటించాలి -** శక్కర్‌నగర్/ఆర్మూర్‌టౌన్/భీమ్‌గల్, జనవరి 6: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలు పాటించాలని ట్రాఫిక్ సీఐ చందర్ రాథోడ్ అన్నారు. బోధన్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ట్రాఫిక్ రూల్స్‌పై సోమవారం అవగాహన కల్పించారు. ఆర్మూర్ కొత్త బస్టాండ్ ఆవరణలో ప్రయాణికులు, ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ రూల్స్‌పై ఎస్సై మహేశ్ అవగాహన కల్పించారు. భీమ్‌గల్‌లో వాహనదారులకు రోడ్డు భద్రత నియమాలను ఎస్సై మహేశ్, ఏఎస్సై సత్తార్ వివరించారు.